# అనామకుడు

**కుం**దనపు బొమ్మలా వుంటుందామె. పల్చటి పెదాలు, లేత చెక్కిళ్ళు. నవ్వినప్పుడు కాంతులీనే కళ్ళు. కుదురైన మొహం, పసుపుపచ్చని వర్ణం, మనిషి సన్నగా వుంటుంది. అంత పొడుగూ కాదు, పొట్టీకాదు. వయస్సు ముప్ఫయ్యేళ్ళున్నా పాతికేళ్ళ యువతిలా కన్పిస్తుంది.

అరుణ్ ఆమెను పట్టించుకునేవాడు కాదు. అతని తత్వమే అంత. ఆమె నా పరిస్థితిలో చూడకపోయినట్లయితే అసలు ఆమె ఉనికినే గమనించేవాడు కాదేమో. ఎండాకాలం, మధ్యాహ్నం పన్నెండయి వుంటుంది. ఆరోజతను ఎక్కడికీ పోలేదు. పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాడు. కరెంటు పోయింది. ఫాను ఆగిపోవటంతో చెమటలు కారసాగాయి. ఈ వేడిలో చెమటతో గదిలో వుండటమెందుకు, హోటల్లో భోజనమైనా చేసి వద్దామని లేచి, గుడ్డలు వేసుకుని గది తాళం వేస్తూ పక్కింటి మేడవైపు చూశాడు. కిటికీలో కుండా పక్కింటి మేడ పై గదిలో ఫాను తిరగటం కనిపించిందతనికి. అంటే కరెంటు పోలేదన్నమాట. ఈ ఇంటికీ, ఆ ఇంటికీ ఒకే పోల్ కనెక్షన్ కదా! గబగబా మెట్లు దిగి ఇంటివారింటికెళ్ళాడు. ''ఫ్యూజు పోయినట్టుందండీ'' అంటూ.

యజమాని ''లేదయ్యా! మా ఇంట్లో ఫాను తిరుగుతూనే వుంది. పైన సబ్‌మీటరు ఫ్యూజు పోయి వుంటుంది. పైన గంగాధరంగారి పోర్షనులో సబ్ మీటరుంది అక్కడ చూడు'' అన్నాడు. పైకొచ్చి తనగది పక్క పోర్షను తలుపు తట్టాడు. రెండు, మూడు సార్లు తట్టినా సమాధానం రాకపోయేసరికి తలుపు తోసి చూశాడు. తలుపు దగ్గరేసుంది. సంకోచంతోనే తలుపు తీశాడతను.

''ఎవరూ! అయ్యో కాస్త సేపు ఆగలేరు?'' అంటూ జాకెట్టు తొడుక్కుంటున్న ఆమె అతన్ని వెనక్కి తిరిగి చూసింది. అతను నాలిక కొరుక్కుంటూ తలుపు దగ్గరకు లాగాడు. ఇంకా ఆమె అప్పటికీ లంగా మీదే వుంది. చీరె కట్టుకోలేదు. తెల్లటి వళ్ళు, ఎత్తయిన ఛాతీ, అప్పుడే స్నానించినట్టుగా నుదుటి ముంగురులపై తడి. ఆ రూపం అతని మనసులో హత్తుకు పోయింది. అతనికే సిగ్గనిపించింది. ఆమెనలాంటి ఇరకాటంలో పెట్టినందుకు.

''ఏం కావాలి?'' అంటూ వచ్చి తలుపు తీసింది ఆమె.

''మీరు .... మీరు'' అన్నాడతను తడబడ్తూ. అతని ఉద్దేశం తన పొరపాటుకు క్షమాపణ చెప్పుకోవాలని.

''నేను ... నేను... ఏమిటి నేను?'' అంది ఆమె కళ్ళు పైకెత్తి నవ్వు పెదాల మధ్య బిగించి.

''ఫ్యూజు పోయినట్టుంది. కాస్త మీటర్ చూద్దామని ...'' నసిగాడతను.

''కాస్తేం, మొత్తం చూడండి'' అంటూ దక్షిణం వేపు గోడకున్న సబ్ మీటర్ని చెయ్యెత్తి చూపింది ఆమె.

పక్కనున్న స్టూలేసుకుని నిలబడి ఫ్యూజ్ తీసి చూశాడు ''ఫ్యూజ్ పోయిందండీ వైరు ముక్క ఏమైనా వుంటే ఇస్తారా?'' అన్నాడు అరుణ్.

ఆమె వైరు వెతికి తెచ్చి ఇచ్చింది. ''చూశారా నేను ఇంకా పవర్ కట్టే అనుకుంటున్నాను. ఫ్యూజు పోయిందన్న జ్ఞానమే కలుగ లేదు నాకు'' అంది.

''బ్లేడుంటే చూడండి.''

ఆమె బ్లేడు తెచ్చి ఇచ్చింది. ఆమె అర్ధ నగ్నరూపం ఇంకా మనసులో మెదలుతున్న అతను హడావుడిగా ఎలక్ట్రిక్ వైరు మీది ప్లాస్టిక్ కోయబోయి వేలుకోసుకున్నాడు.

''అయ్యో! వేలుకోసుకున్నారే. అంత తొందర ఎందుకు, మెల్లగా చెయ్యొచ్చుగా'' అంటూ లోపలికి వెళ్ళి తడి గుడ్డ పీలిక అతని వేలిచుట్టూ చుట్టింది.

ఆమె స్పర్శతో అతడు తనను తనే మర్చిపోయాడు. బుర్రలో ఫ్యూజు పోయింది. మళ్ళీ ప్లాస్టిక్ కోయబోయి ఇంకో వేలు కోసుకున్నాడు.

''అయ్యో మీకేమైంది, తీరిగ్గా కూచుని వేళ్ళు కోసుకుంటున్నారు. ఆవైరు, బ్లేడు పక్కన పెట్టండి, నేను చెక్కిస్తాను'' అంటూ ఆమె మరో తడి గుడ్డ పీలిక అతని వేలి చుట్టూ చుట్టింది. ఆమె ప్లాస్టిక్ చెక్కేసి రాగి తీగెలు తీసి అతనికిచ్చింది.

''పరధ్యానంలో పొరపాటైంది'' అన్నాడు అతను రాగి తీగెలు ఫ్యూజులో అమరుస్తూ.

''పరధ్యానం మంచిది కాదు. మీకు పెళ్ళయిందా?'' అడిగింది ఆమె.

''అయ్యింది ఆమెని పురుటికి అత్త వారింట్లోదించి, ట్రాన్స్‌ఫరైతే ఉద్యోగానికి నేనిక్కడకొచ్చాను'' అన్నాడు అతను స్టూలు మీద నిలబడి ఫ్యూజ్ సాకెట్లో అమరుస్తూ. కరెంట్ రాంగానే స్విచ్ వేసి వున్నట్టుంది ఫాన్ తిరగసాగింది.

''మరింత పరధ్యాన మెందుకో...''

''చూడకూడనివి చూస్తే బ్రహ్మకైనా పుట్టు రిమ్మతెగులు అన్నారు చూడండి''.

''సరేలే ఇహ దిగండి, ఈ కాఫీ తాగండి పాపం కష్టపడ్డారు'' అంటూ టేబిల్ మీద ఫ్లాస్కులో నుండి కప్పులో కాఫీ పోసి ఇచ్చింది ఆమె.

''మీ పేరు... అహ... పరిచయమైంది కనుక అడుకుతున్నాను'' అన్నాడతను.

''స్వర్ణ''.

''మీకు తగిన పేరు. నా పేరు...''

''పేరుకేం లేండి. పేర్లతో నాకు పనిలేదు.''

''మరి...''

''ఫ్యూజ్ అరేంజ్ చేశారుగా థాంక్స్''.

''మెడికల్ రిప్రజెంటేటివ్‌ని'' అన్నాడు అరుణ్ మాటలు పొడిగించటానికి. అతని కప్పుడే వెళ్ళాలని లేదు.

''బావుంది. మావారి జాతేనన్న మాట. ఆయన పరిమళా కాస్మెటిక్స్‌లో సీనియర్ సేల్స్ మేనేజర్. ఆయనకు తరచు క్యాంపులవీ వుంటాయి. ఇప్పుడు వరంగల్ క్యాంపు మీదే వెళ్ళారు'' అంది ఆమె.

''అప్పుడు బహుశ, మీకొక్కతికీ తోచదేమో''.

''ఇహ తోస్తుంది లెండి, మీరు పరిచయమయ్యారుగా.''

అలాగయిన పరిచయం నిజానికి అతని ప్రమేయం లేకుండానే గాఢమైంది.

అంతా తన ప్రతిభే ననుకున్నాడు అతను. ఆమెను తనవైపు తిప్పుకోవాలని ప్రయత్నించాడతను.

వారం రోజుల తరువాత సాయంత్రం స్కూటర్ మీద వెళ్తూంటే తమ వీధి చివర ఆమె కన్పించింది. ఆమె పక్కన స్కూటరాపి అడిగాడతను ''ఎటో వెళ్తున్నారు?'' అని.

''షాపింగ్‌కి కోఠీ వెళ్దామని''.

''రండి, డ్రాప్ చేస్తాను.''

''వద్దు, ఎవరైనా చూస్తే బావుండదు.''

''ఏం ఫరవాలేదు, రండి'' అతను బలవంతం చేశాడు. ఇష్టం లేనట్టుగానే ఆమె స్కూటర్ వెనక కూర్చుంది. స్కూటర్ని పోనిచ్చాడు అరుణ్. రోడ్డు కుదుపులకు అతని భుజాన్ని పట్టుకుంది. ఆమె స్పర్శ అతన్ని ఊహాలోకాల్లో తేలేట్లుచేసింది.

''కొంచెం మెల్లగా పోనివ్వండి. క్రితంసారి వేళ్ళు కోసుకున్నారు. ఈసారి ఏక్సిడెంట్ చేస్తారేమో'' అని నవ్విందామె.

''నేనెప్పుడూ ఆక్సిడెంట్లు చెయ్యలేదండీ.''

''ఇంతకు ముందెప్పుడైనా వేళ్ళు కోసుకున్నారా?''

''అది పొరబాటు.''

''ఇదీ పొరబాటు కావచ్చు, మెల్లగా పోనివ్వండి.''

కోఠీలో షాపింగ్‌కి ఆమెతో పాటు అతనూ వెళ్ళాడు. తిరిగి ఆమెను ఇంటిదగ్గర దించిందాకా అతను వదల్లేదామెను.

మరో రెండు రోజులకు.

''ఏం సినిమాలు చూశారు?'' అని అడిగింది ఆమె. పొద్దున్నే తలంటుకుని బాల్కనీలో నిలబడి జుట్టు చిక్కు తీసుకుంటూ.

''గీతాంజలి బావుందట. వస్తారా వెళ్దాం.''

''అమ్మ బాబో, నేనా, మీతోనా...''

''ఏం? నేనేం రాక్షసుడ్ని కాదు లెండి. సాయంత్రం నాల్గింటికి వీధి చివర మీకోసం వెయిట్ చేస్తూంటాను. రాకపోతే ఒట్టే.''

చురుగ్గా ఓసారి అతని వంక చూసి ఆమె ఇంట్లోకి వెళ్ళిపోయింది.

వీధి చివర స్కూటర్ మీద ఆమెకోసం నిరీక్షిస్తున్న అరుణ్‌కి ఆమె రాదన్న అనుమానంలేదు. 'ఎందుకురాదు వస్తుంది. తను కాలేజీలో చదివే రోజుల్లోనే ఆడపిల్లలు తనంటే పడి చచ్చేవాళ్ళు. ఆమె కళ్ళల్లో తనంటే ఆసక్తి కనిపిస్తూనే వుంది' అనుకున్నాడు. అతననుకున్నట్టుగానే ఆమె వచ్చింది. ఆమెను చూడగానే గర్వంగా తనలో తను నవ్వుకున్నాడు అరుణ్. ఇహతను చొరవ చూపించాలి. ఆమెను లొంగతీసుకోవాలి. ఆ ప్రయత్నంలోనే సినిమా హాల్లో చీకటిలో ఆమె భుజం మీద చెయ్యి వేశాడు. ఆమె పట్టించుకోలేదు. సినిమాలో లగ్నమై పోయింది. భుజం మీదుగా చెయ్యి వేసి దగ్గరకు లాగి ముద్దు పెట్టుకున్నాడు అతను. ''ఛీ ఏమిటిది పబ్లిగ్గా'' అంది ఆమె.

''ప్రైవేటుగా అయితే ఫరవాలేదన్నమాట.''

''బాగుంది మనమెందుకొచ్చాం. ముందు సినిమా చూడు.''

''నాకు సినిమాకంటే మీరే బాగున్నారు.''

''పిచ్చెక్కినట్టుందే''

''మీరు కరుణిస్తే పిచ్చి కుదుర్తుంది.''

ఆమె తన భుజం మీది అతని చెయ్యి పక్కన పెట్టి సినిమా చూడసాగింది. కాసేపాగి ఆమె ఒళ్ళో చెయ్యి వేశాడు. ఎక్కడెక్కడో వెతకసాగాడు. మొదట్లో ఆమె పట్టించుకోలేదు. కాసేపున్న తరువాత ''నువ్విలా చేసేట్టయితే నే వెళ్ళిపోతా బాబు!'' అంది ఆమె లేవబోతూ.

''ఏం చేయనులెండి ఇంక. కూర్చోండి'' అన్నాడు అతను అర్థవంతంగా నవ్వుతూ.

రాత్రికి ఇంటికి వచ్చినతర్వాత ''హోటల్‌కి వెళ్తారా భోజనానికి'' అంది ఆమె.

''మీరు పెట్టనంటే వెళ్ళిపోతాను'' అన్నాడు అతను.

''దానికేం భాగ్యం, రండి'' అందామె.

భోజనమైన తరువాత ''ఇహ పదండి, నేను పడుకోవాలి'' అంది ఆమె.

''ఒక్క ముద్దు పెట్టుకు వెళ్ళిపోతాను'' అంటూ ఆమె 'సరే' ననకుండానే ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. ఆమె గింజుకుంది. అతను ముద్దులతో ఆపలేదు. శరీరాన్ని తడమసాగాడు. ఎక్కడెక్కడో తేలిపోతున్నట్టు మగతగా వున్న ఆమెని పక్కమీద చేర్చి లైటార్పేశాడు అరుణ్.

ఒంటి వేడి చల్లారగానే పక్కకి జరిగి గర్వంగా విజేతలా ఆమె వంక చూశాడు. ఆమె మోకాళ్ళ మీద తల పెట్టుకు కూర్చుంది.

''మీకు పిల్లల్లేరా?'' అడిగాడతను.

ఆమె మాట్లాడలేదు.

''మీ ఆయన వల్ల కాలేదు లాగుంది. ఇహ పుడ్తారులే'' అన్నాడు. ఆడదాన్ని జయించిన మొగ అహంకారం మాట్లాడిస్తోంది.

''నేను నీకు లొంగి పోయినందుకు, ఆయన చులకనగా కనిపిస్తున్నారా? ఇంకెప్పుడూ ఆయన ప్రసక్తితేకు, బావుండదు'' అంది ఆమె తలెత్తి.

''మరి పిల్లలెందుకు పుట్టలేదు.''

''మా ఖర్మ. ఇహ దయచెయ్యి'' అని అతన్ని చెయ్యి పట్టుకు లేపి, బయటకు పంపి, తలుపు గడియ పెట్టేసింది ఆమె.

అలా మొదలైన సంబంధం రెండు నెలలు సాగింది. ప్రతి రాత్రీ అతనికి ఆమెతోనే గడపాలని ఉండేది. కానీ వీలయ్యేది కాదు. ఆమె భర్త ఊళ్ళో వుంటే ఆమె కన్పించేది కాదు. ఈ మధ్య గంగాధరం శెలవుపెట్టి ఇంట్లోనే వుంటున్నాడు. ఆమెకు ఒంట్లో బావుండలేదట. ఆయన ఇంట్లో లేనట్టు కన్పిస్తే తలుపు తట్టాడు అరుణ్ ఓరోజు.

''తలుపు దగ్గరికే వేసి వుంది. రండి లోపలికి'' గంగాధరం గొంతు విన్పించింది.

తప్పుకోలేక లోపలికెళ్ళాడు అరుణ్.

''నువ్వేనటయ్యా పక్కనున్న మెడికల్ రిప్రెజెంటేటివ్‌వి. నీ పేరు అరుణ్ కదూ? ఇంటాయన చెప్పాడు'' అన్నాడు గంగాధరం.

''ఏం చెప్పాడో ఇంటాయన'' అని అరుణ్ గుండె గుబుక్కుమంది.

''మా తమ్ముడు రవిలాగా లేట్టే ఇతను'' అన్నాడు గంగాధరం భార్యతో.

ఆమె ఏం మాట్లాడక అతని వేపు ఓసారి చురుగ్గా చూసి లోపలికి వెళ్ళిపోయింది.

''ఏమిటలా వున్నారు? ఒంట్లో బావుండినట్టులేదు ఆమెకి.''

''వేవిళ్ళయ్యా! అంతకంటే ఏం లేదు.''

అరుణ్ గుండె గర్వంగా పొంగింది. ''మీ పరిచయం చేసుకుందామని వచ్చాను'' అన్నాడు అతను ఏం మాట్లాడకపోతే బావుండదని.

అలా ఆమెతో ఒంటరిగా మాట్లాడడమే పడలేదు అతనికి. ఓసారి అతను నిజామాబాద్ క్యాంప్‌కి వెళ్ళి వచ్చేటప్పటికి ఆమె ఇంట్లోలేదు, కన్పించనేలేదు. ఆమె ఎక్కడికి వెళ్ళిందో - అతనికర్థం కాలేదు. ఎవర్ని అడగాలో, అడిగితే ఏమనుకుంటారో అతనికి తెలియలేదు. భోజనానికి హోటలుకెళ్తే అక్కడ గంగాధరం కన్పించాడు.

''మీరూ హోటలుకొచ్చారు. మీ భార్య లేరా?'' అని అడిగాడు అరుణ్.

''లేదయ్యా, పురిటికి పుట్టింటికి వెళ్ళింది. వాళ్ళ నాన్న వచ్చి తీసికెళ్ళాడు మొన్న. నాకు వంటరాదు. ఈ ఐదునెల్లూ హోటలుకూడే'' అన్నాడాయన.

ఆ తరువాత అరుణ్ ఆమెను చూడలేకపోయాడు. మామగారు ప్రయత్నించి మళ్ళీ అతన్ని విజయవాడ ట్రాన్స్‌ఫర్ చేయించాడు. రెండు సంవత్సరాల తరువాత ఓసారి పనిమీద హైదరాబాద్ వచ్చినప్పుడు తాను పూర్వం అద్దెకున్న ఇంటికి వచ్చి గంగాధరంగార్ని గూర్చి వాకబు చేశాడు.

''వాళ్ళు ఖాళీ చేసి పోయి ఆర్నెల్లయింది. ముషీరాబాద్‌లో ఫ్లాట్ కొన్నారు. ఫోన్ నెంబర్ కావాలంటే ఇస్తాను'' అని ఇంటి యజమాని ఫోన్ నెంబర్ ఇచ్చాడు.

అరుణ్ గంగాధరం ఇంటికి ఫోన్ చేశాడు. స్వర్ణ ఫోన్ ఎత్తింది.

''హలో... ఎవరు మాట్లాడుతోంది?'' అంది.

''నేనండీ అరుణ్‌ను. మీరు స్వర్ణగారేనా మాట్లాడుతోంది?''

''అవును. అరుణ్ పేరుగల వాళ్ళెవ్వరూ నాకు తెలీదు.''

''నేనండీ చిక్కడపల్లిలో మీ ఇంటి పక్క గదిలో అద్దెకున్న మెడికల్ రిప్రజెంటేటివ్ అరుణ్‌ని. గుర్తుపట్టలేదా?'' అడిగాడతను.

నిజానికి ఆమె అతన్ని మర్చిపోలేదు. ఆమె కతని పేరు తెలీదు. ఆమెకా అవసరం అప్పుడూ లేదు. ఇప్పుడూ లేదు. ఆమె అవసరానికి పేరుతో పనిలేదు. అతను ఆరోగ్యవంతుడు, అందమైన వాడు, చురుకైన వాడు, గర్భిణీ అయిన భార్యకు భర్త అనే ఆమెకు గుర్తు. అతనితో అవసరం ఆమె కంతవరకే.

గంగాధరం దంపతులకు పెళ్ళయి ఆరేడేళ్ళయినా పిల్లలు పుట్టలేదు. పిల్లల కోసం ఆరాటపడి పోయింది స్వర్ణ. దంపతులిద్దరూ వైద్య పరీక్ష చేయించుకున్నారు. 'స్వర్ణలో లోపమేమీ లేదు. అతనికే స్పెరమ్ కౌంట్ సరిగ్గా లేదు, మందులిస్తే పెరుగుతుంది. ఆమె గర్భం ధరించే అవకాశం వుంది' అని చెప్పారు డాక్టర్లు. గంగాధరం మందులు వాడాడు. ఫలితం కన్పించలేదు. మరో నాలుగేళ్ళు నిరీక్షించింది స్వర్ణ. ఓ ఆదివారం, అంబిక, అంబాలికలకు 'నియోగ' పద్ధతి ద్వారా

ధృతరాష్ట్రుడు, పాండురాజు పుట్టటం టీ.వి. భారతంలో చూసినప్పుడు ఆమె కాలోచన కలిగింది. తనూ ఆ పని ఎందుకు చేయకూడదు. భారతకాలంలోని సమాజం కంటే కుళ్ళిపోయిన ప్రస్తుత సమాజం దాన్ని హర్షించదు. కానీ పిల్లలు కావాలన్న తహతహ ఆమెని ఉండబట్టనివ్వలేదు. ఆ సమయంలోనే ఆమె దృష్టి అరుణ్ మీద పడింది. తన అందాన్ని చూసే ఆమె తన వల్లో పడిపోయింది అనుకున్నాడు. ఆరోజు ఆమే కావాలని ఇంట్లో ఫ్యూజ్ వైర్ లాగేసింది. అతను వస్తాడన్న నిశ్చయంతోనే తలుపు బోల్టు పెట్టకుండా ముందు గదిలో గుడ్డలు మార్చుకుంది. అతను బయటకు వెళ్ళటానికి సన్నద్ధమవటం చూసి తనే ముందుగా వెళ్ళి వీధి మొదల్లో అతనికి కన్పించి షాపింగ్‌కి అతని స్కూటర్ మీద వెళ్ళింది. సినిమా ప్రస్తావన ఆమే తీసుకు వచ్చింది. అన్నీ తనేచేసి, అతనే తన్ను లోబరుచుకున్నట్టు ప్రవర్తించి అతని మొగ అహంకారాన్ని తృప్తి పరచింది. తనక్కావాల్సింది పొందింది. ఆమెకు అతని అవసరం తీరిపోయింది. పండంటి బాబును కన్నది. భర్తంటే అసంతృప్తేం లేదు ఆమెకు. హాయిగా సాగిపోయే సంసారాన్ని కూలదోసు కోవాల్సిన అవసరంలేదు ఆమెకు.

''ఏమిటి ఆలోచిస్తున్నారు. నన్నే గుర్తు పట్టలేదా?'' అని అతని గొంతు ఫోనులో పలకంగానే ఆమె ఉలిక్కిపడి ప్రస్తుతానికి వచ్చింది.

''సరే ఇంతకీ ఏమిటి?'' అంది ఆమె.

''మనకు బాబా, పాపా పుట్టింది?''

''మనకు కాదు. మాకు బాబు పుట్టాడు.''

''ఇంత కృతఘ్నత పనికి రాదు.''

''అదే నేనూ అనేది. పొందింది చాలు, కృతఘ్నుడి లాగ ప్రవర్తించక.''

''వచ్చి చూస్తాను బాబును, అడ్రస్ చెప్పండి.''

''అక్కర్లేదు. నాక్కావాల్సిన పనికి నువ్వయినా, మరో అనామకుడైనా చాలు. థాంక్యూ ఫర్ది సేం. చల్లగా నీకాపురం నువ్వు చేసుకో, నన్నిలా బతకనీ. బతికించి చంపడం మానవత్వంకాదు'' అని ఫోన్ పెట్టేసింది ఆమె.

అనామకుడు ఫోన్ క్రెడిల్ చేశాడు.

'మయూరి' సచిత్ర వారపత్రిక

13-10-1989